మళ్లీ గుంతల గండం!

- ఆరు నెలలకే సీవీఆర్ ఫ్లైఓవర్‌పై మళ్లీ గుంతలు
- ప్రమాదాల బారిన వాహనచోదకులు



సీవీఆర్ ఫ్లై ఓవర్‌పై గోతులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్‌పై మళ్లీ గుంతలు గండం ఎదురవుతోంది. ఆరు నెలల క్రితం ఫ్లైఓవర్‌పై రోడ్డుకు మరమ్మతులు చేశారు. అయితే వర్షాకాలం ప్రారంభం కావడంతో మళ్లీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఫ్లైఓవర్‌పై ప్రయాణమంటేనే వాహన చోదకులు బెంబేలెత్తిపోతున్నారు. రాత్రి వేళ గోతులు కనిపించక వాహనాలు వాటిలో దిగబడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

రూరల్ ప్రాంతాల ప్రజలు నగరానికి త్వరగా చేరుకునేందుకు 2011లో ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించారు. ఈ నిర్మాణ సమయంలో నెలకు పది వేల వాహనాలకు పైగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తాయని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారు. ఇప్పుడు పెరిగిన ట్రాఫిక్, వాహనాల రాకపోకలు, గ్రామాలు అభివృద్ధి చెందడంతో వాహనాల రాకపోకల సంఖ్య దాదాపు మూడింతలైంది. ఫ్లైఓవర్ రోడ్డుకు మరమ్మతులు చేసినా సింగిల్ లేయర్ మాత్రమే వేయడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారిపై మళ్లీ గోతులు పడ్డాయి.

ఔటర్ రోడ్డు అందుబాటులోకి వస్తేనే..

రాయనపాడు వద్ద నిర్మించిన ఔటర్ రోడ్డు అందుబాటులోకి వస్తేనే ఫ్లై వోవర్‌కు ఇబ్బందులు తగ్గుతాయని నగర వాసులు పేర్కొంటున్నారు. హైదరాబాద్‌తో పాటు ఇబ్రహీంపట్నం, రాయనపాడు, కేతనకొండ ప్రాంతాల నుంచి వచ్చే ఇసుక, కంకర లారీలు, టిప్పర్లు గొల్లపూడి, కబేళా, నైనవరం ఫ్లైవోవర్ మీదగా పైపుల రోడ్డుకు ప్రయాణిస్తున్నాయి. ఔటర్ రోడ్డు అందుబాటులోకి వస్తే లారీలు, టిప్పర్లు నేరుగా పాముల కాల్వ వరకు వచ్చి సర్వీసు రోడ్డులో పైపుల రోడ్డులోకి వెళ్లే వీలవుతుందని లారీ డ్రైవర్లు పేర్కొంటున్నారు. అయితే ఔటర్ రోడ్డులో కొన్ని పాయింట్లలో ఇంకా కొన్ని పనులు మిగిలి ఉండటంతో తిప్పలు తప్పడం లేదని డ్రైవర్లు పేర్కొంటున్నారు.



ఫ్లై ఓవర్‌పై మరోచోట ఇలా

గోతులతో నిత్యం ప్రమాదాలే..!

విజయవాడ నుంచి కొత్తూరు తాడేపల్లి, వెలగలేరు, షాబాద్, అంబాపురం, నైనవరం, జక్కంపూడి, వేమవరం, కందులపాడు అడ్డరోడ్డు మొదలు మైలవరం వైపు వెళ్లే వారు ఈ ఫ్లైవోవర్ మీదగా ప్రయాణం సాగించాలి.

జక్కంపూడి కాలనీలోని వేలాది కుటుంబాలు తమ ఉపాధి కోసం ఈ ఫ్లైవోవర్ మీదగానే నగరానికి చేరుకుంటారు. సుమారు 40 నుంచి 50 వేల మంది ప్రయాణం సాగించే ఈ ఫ్లైవోవర్‌కు సరైన నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుందంటున్నారు. రాత్రి వేళల్లో ఫ్లైవోవర్‌పై ఉన్న గోతులను తప్పించే క్రమంలో వెనుక వచ్చే వాహనాల కింద పడి ప్రతి రోజూ ప్రయాణికులు తీవ్రగాయాలవుతున్నారు.

భారీ వాహనాలను నిషేధిస్తేనే మేలు

ఫ్లైవోవర్ దెబ్బతినడానికి భారీ వాహనాల రాకపోకలే ప్రధాన కారణమని వైఎస్సార్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పగటి వేళ కబేళా మీద నుంచి భారీ టిప్పర్లు ఫ్లైవోవర్ పైకి వస్తుండటమే గోతులు పడటానికి కారణమంటున్నారు. రాత్రి 10 గంటల తర్వాత సిటీలోకి లారీలు, ఇతర భారీ వాహనాలను సైతం అనుమతించడంతో అవి వైవీ రావు ఇన్నర్ రింగ్ మీదగా ఫ్లై వోవర్ పైకి వచ్చి నగరంలోకి ప్రవేశిస్తున్నాయంటున్నారు. పగలు కూడా ఫ్లైవోవర్‌పై నుంచి భారీ వాహనాలతో పాటు లారీలు, ఇసుక, కంకర ట్రాక్టర్లను సంబంధిత అధికారులు నిషేధించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

దుర్గాఘాట్‌లో బారికేడ్ల ఏర్పాటు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గాఘాట్‌లో హాకర్లు తమకు కేటాయించిన హద్దును మీరకుండా దేవస్థానం బారికేడ్లను ఏర్పాటు చేసింది. సోమవారం సాయంత్రం దుర్గగుడి ఈవో శీనానాయక్, ఏసీ రంగారావు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు దుర్గాఘాట్‌లో పనులను పరిశీలించారు. హాకర్లు తమకు కేటాయించిన స్థలాన్ని దాటి ముందుకు వస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పుణ్యస్నానాలకు వచ్చే భక్తులు లగేజీని భద్రపరుచుకునేందుకు అవసరమైన క్లోక్ రూమ్, చెప్పుల స్టాండ్‌లను ఏర్పాటు చేయాలని ఈవో శీనానాయక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దుర్గాఘాట్ ఎదుట రోడ్డుపై ఉన్న కొండ మట్టి, రాళ్లను వెంటనే తొలగించాలని ఆదేశించడంతో హుటాహుటిన పనులను ప్రారంభించారు.

ఉచిత కంటి పరీక్షలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూరపాటి చంద్రశేఖరరావు హైస్కూల్ వ్యవస్థాపకుడు కూరపాటి లక్ష్మీనారాయణరావు 82వ జయంతిని పురస్కరించుకొని పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాఠశాల కార్యదర్శి కూరపాటి చంద్రశేఖరరావు, అయాన్ కంటి ఆస్పత్రి వైద్యులు బషీర్ అహ్మద్ హాజరయ్యారు. ముందుగా నారాయణరావు చిత్రపటం ముందు జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులకు డాక్టర్ బషీర్ కంప్యూటర్‌పై కంటి పరీక్షలు చేశారు. యుగంధరాచార్య మాట్లాడుతూ కళ్లు చక్కగా కనపడాలంటే పౌష్టికాహారం ఎంతో అవసరమన్నారు. పాలు, క్యారెట్లు, ఆకుకూరలు, కూరగాయలు, తృణధాన్యాలు, నట్స్, వంటి ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. కార్యదర్శి చంద్రశేఖరరావు 20 మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు.

కొబ్బరిచిప్పల కాంట్రాక్టర్‌కు రూ. 25వేలు జరిమానా

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో భక్తులు సమర్పించే కొబ్బరిచిప్పలను పోగు చేసుకునే కాంట్రాక్టర్‌కు ఈవో శీనానాయక్ సోమవారం రూ. 25 వేలు జరిమానా విధించారు. నిబంధనలను ఉల్లఘించినందుకు జరిమానా విధిస్తున్నట్లు ఈవో.. కాంట్రాక్టర్ దుర్గారావుకు నోటీసులు జారీ చేశారు. వీటిపై మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. కాంట్రాక్టర్ డిపాజిట్ సొమ్ములో జరిమానాను మినహాయించి, దేవస్థాన రశీదు అందిస్తుందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. టెండర్ ప్రక్రియలో దేవస్థానం విధించిన నిబంధనలను ఉల్లంఘించిన ప్రతి కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేసి, జరిమానా విధిస్తామని ఈవో పేర్కొన్నారు. భక్తులను ఇబ్బందులకు గురిచేసే కాంట్రాక్ట్ రద్దు చేసేందుకు కూడా వెనుకాడబోమని ఈవో ప్రకటించారు.

కళాకారుల సంక్షేమానికి కృషి



విజయవాడ కల్చరల్: సాంస్కృతిక సంస్థలు కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు కోరారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, పోలవరపు సాహితీ సమితి, క్రామేడ్ జీఆర్‌కే సంస్థల ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని ఆశిష్ స్టూడియోలో సోమవారం జిల్లా కళాకారుల ఆత్మీయ సమావేశం, సినీ సంగీత విభావరి జరిగాయి. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు మాట్లాడుతూ.. కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. వివిధ సంస్థల ప్రతినిధులు బి.వి.వీరభద్రరావు, శ్యాంప్రసాద్ కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

చీటీల డబ్బు చెల్లించడం లేదని కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చీటీలు కట్టించుకొని తిరిగి సొమ్ము చెల్లించడం లేదని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఊర్మిళానగర్‌కు చెందిన చెన్నమ్మ అనే మహిళ నాగరాజు అనే వ్యక్తి వద్ద చీటీలు వేసింది. రూ. 2లక్షల చీటీ, రూ. 5లక్షల చీటీలు మూడు వేసింది. 15 నెలల పాటు డబ్బులు చెల్లించింది. ఆ తర్వాత వాయిదాలు కట్టించుకోవడం లేదని, తాను చెల్లించిన డబ్బులు తిరిగి చెల్లించకుండా తప్పుకు తిరుగుతున్నాడని, తనకు రూ. 6.98 లక్షలు రావాల్సి ఉందని భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పేదల ఇళ్లను త్వరితగతిన నిర్మించండి



హౌసింగ్ వివరాలు తెలుసుకుంటున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): పేదలకు అందించే ఇళ్లను త్వరితగతిన నిర్మించాలని విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం ఆదేశించారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనం మీటింగ్ హాల్‌లో కాంట్రాక్టర్లు, లబ్ధిదారులు, హౌసింగ్, వీఎంసీ అధికారులతో సోమవారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లందరూ సహకరించాలని, త్వరితగతిన ఇళ్లన్నీ పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్లు, అధికారుల మధ్య సమన్వయ లోపంలో ఉన్న అంశాలను ముఖాముఖి చర్చించడంతో సమస్యలను పరిష్కరించారు. ప్రభుత్వం తరపు నుంచి వారికి సంపూర్ణ సహాయం అందుతుందని వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లకు కేటాయించిన ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వీఎంసీ చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్(వర్క్స్) పి.సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్(యూసీడీ) విభాగం పి.వెంకట నారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, హౌసింగ్ పీడీ రజిని కుమారి, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో టీబీ నివారణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముందస్తు పరీక్షలు చేయించుకుంటే టీబీ వ్యాధిని నివారించవచ్చని మెడికల్ ఆఫీసర్ మెహనాజ్ పేర్కొన్నారు. విద్యాధరపురంలోని మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్ ఎదురుగా ఉన్న భవానీపురం-3 యూపీహెచ్‌సీలో సోమవారం సీవై-టీబీ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ మెహనాజ్ మాట్లాడుతూ బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్నవారిలో క్షయ ఎక్కువగా వస్తుందని తెలిపారు. ఇది ఊపిరితిత్తుల్లోనే కాకుండా ఇతర అవయవ వ్యవస్థల్లో సంభవిస్తుందని పేర్కొన్నారు. దగ్గు, అలసట, తలనొప్పి, బరువు తగ్గడం, జ్వరం (మధ్యాహ్నం/సాయంత్రం), రాత్రిపూట చెమటలు పట్టడం వంటివి వ్యాధి లక్షణాలన్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు క్షయ వచ్చే అవకాశం ఉందన్నారు. షుగర్ వ్యాధి ఉండి 60 ఏళ్లు దాటినవారికి వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో కొత్తపేట టీబీ యూనిట్ సిబ్బంది ఎస్‌టీఎస్ ఫ్రాన్సిస్, ఎస్‌టీఎల్‌ఎస్ జోసఫ్ తంబి, టీ బీహెచ్‌వీ రమీజ, యూపీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి విఫలం

- ప్రశ్నిస్తానన్న పవన్ ఏమయ్యారు?
- పేదలకు ఇళ్ల స్థలాలు ఎప్పుడిస్తారు?
- సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు



సభలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా హామీలను అమలులో ఘోరంగా విఫలమైందని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు విమర్శించారు. విద్యాధరపురంలోని సుబ్బరాజు భవన్‌లో కొత్తపల్లి పిచ్చయ్య అధ్యక్షతన 45వ డివిజన్ శాఖ రెండో మహాసభ జరిగింది. టీడీపీ కూటమి అధికారంలో రాగానే సూపర్ సిక్స్ పేరుతో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తామని నమ్మించి ప్రజలను మోసం చేసిందన్నారు. హామీల్లో భాగంగా పేదలకు పట్టణాలు, నగరాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున స్థలం ఎప్పుడు ఇస్తారని నిలదీశారు.

పవన్ ఎందుకు ప్రశ్నించడం లేదో..

ఎన్నికల హామీల అమలు బాధ్యత తనదని, అలా జరగకపోతే ప్రశ్నిస్తానని చెప్పిన జనసేనాని పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎందుకు ప్రశ్నించడం లేదని మండిపడ్డారు. ఏడాది పాలన పూర్తైన సందర్భంగా ప్రతి ఇంటికీ వస్తామని చెబుతున్న కూటమి ప్రజాప్రతినిధులు ఏ ముఖం పెట్టుకుని వస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారు

సీపీఐ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు తాడి పైడయ్య, కొట్టు రమణరావు, డివిజన్ ఇన్‌చార్జ్ పంచదార్ల దుర్గాంబ, కార్యవర్గ సభ్యులు కంచర్ల నాగేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి ఉప్పలపాటి శివప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్స్



గాంధీనగర్‌లో స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న స్విమ్మింగ్ పూల్స్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా సోమవారం ఆయన గాంధీనగర్‌లోని స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలు జరుగుతున్నందున అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్స్ నిర్వహించాలన్నారు. స్విమ్మింగ్ పూల్‌కు వచ్చే ప్రతి ఒక్కరికీ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, షవర్, జిమ్, మరుగుదొడ్ల నిర్వహణను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని, మరమ్మతులకు గురైతే వెంటనే బాగు చేయాలని అధికారులను ఆదేశించారు.

గ్యాలరీల అభివృద్ధికి చర్యలు

స్విమ్మింగ్ పూల్ ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని, పూల్ ఆవరణలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు మొక్కలను పెంచాలని కమిషనర్ సూచించారు. మిషన్ల ద్వారా జరిగే పారిశుద్ధ్య నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.కమిషనర్ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్‌కృష్ణ నాయక్, పర్యవేక్షణ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్య కుమారి, ప్రాజెక్ట్ ఆఫీసర్(యూసీడి) పి.వెంకట నారాయణ, డీఎఫ్‌ఓ మాల్యాద్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీఎన్‌బీఎస్ డెప్యూటీ సీటీఎంగా పవన్‌కుమార్

బస్‌స్టాండ్(విజయవాడపశ్చిమ): పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా సీహెచ్‌ఎస్ పవన్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు నూజివీడులో డిపో మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన పీఎన్‌బీఎస్‌లో డెప్యూటీ సీటీఎంగా పదోన్నతిపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్‌స్టేషన్ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. ఇప్పటి వరకు డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నర్రా శ్రీనివాసరావు సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. ఎన్టీఆర్ జిల్లా డీపీటీఓ నర్రా శ్రీనివాసరావు సంస్థ కోసం చేసిన కృషిని కొనియాడారు. అనంతరం పలువురు అధికారులు, ఉద్యోగులు ఆయనను సత్కరించారు.

అమ్మ సన్నిధిలో ఉద్యోగం పూర్వజన్మ సుకృతం



రామకోటేశ్వరరావుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో ఉద్యోగం చేయడం పూర్వజన్మ సుకృతమని దుర్గగుడి ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఉద్యోగి వై. రామకోటేశ్వరరావు సోమవారం ఉద్యోగ విరమణ కార్యక్రమం మహామండపం ఆరో అంతస్తులో నిర్వహించారు. ముఖ్య అతిథులు ఈవో శీనానాయక్, అసిస్టెంట్ కమిషనర్ రంగారావు.. రామకోటేశ్వరరావును శాలువాతో సత్కరించి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. 1999లో అటెండర్‌గా ఉద్యోగంలో చేరిన రామకోటేశ్వరరావు ఈ రోజు జూనియర్‌అసిస్టెంట్‌గా ఉద్యోగ విరమణ చేయడం, ఇక్కడే ఉద్యోగిగా చేరి ఇక్కడే రిటైర్ కావడం అమ్మవారి అనుగ్రహమన్నారు. తొలుత రామకోటేశ్వరరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకోగా, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు ఎన్. రమేష్‌బాబు, వెంకటరెడ్డి, డాక్టర్ గంగాధర్, తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత కలిగిన అధికారి డీఆర్ శర్మ



డాక్టర్ శర్మను సత్కరిస్తున్న ప్రముఖులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వృత్తిపై నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన అధికారి ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ డీఆర్ శర్మ అని పలువురు వక్తలు కొనియాడారు. డాక్టర్ డీఆర్ శర్మ ఉద్యోగ విరమణ సందర్భంగా అభినందన సభను కొత్తపేట కేబీఎన్ కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించారు. డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుమలత మాట్లాడుతూ సహోద్యోగులతో స్థాయీభేదం లేకుండా శర్మ సత్సంబంధాలు కలిగి ఉంటారన్నారు. జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రసాద్ బాబు మాట్లాడుతూ క్లిష్టమైన సమస్యలను తేలికగా పరిష్కరించగల నేర్పరితనం శర్మకు ఉందన్నారు. కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాసు, హిందూహైస్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, ఇగ్నో డెప్యూటీ రిజిస్ట్రార్ సి.బాలచందర్, డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి శరత్ చంద్ర తదితరులు ప్రసంగించారు. ఇగ్నో బృందం శర్మను ఘనంగా సత్కరించింది.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి భవాని

విజయవాడలీగల్: దైనందిన జీవితంలో ఒత్తిడి బారిన పడకుండా ధ్యానం దోహదపడుతుందని పోక్సో కోర్టు జడ్జి వి.భవాని సూచించారు. బెజవాడ బార్ అసోసియేషన్ హాలులో సోమవారం వన్‌నెస్ ఎక్స్‌పీరియన్స్ పేరిట మెడిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి భవాని మాట్లాడుతూ.. జడ్జి విధుల్లో తాము చాలా ఒత్తిడికి గురవుతామన్నారు. ధ్యానం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని తిరిగి పొంది మనశ్శాంతితో ఎక్కువగా ప్రజలకు సేవలు అందించొచ్చని సూచించారు. బీబీఏ అధ్యక్షుడు ఎ.కె. బాషా మాట్లాడుతూ.. రోజువారీ పని ఒత్తిడితో చాలా మంది న్యాయవాదులు అనారోగ్యం పాలవుతున్నారని, ధ్యానంతో ఆరోగ్యం పొందొచ్చని పేర్కొన్నారు. బీబీఏ మాజీ అధ్యక్షుడు వేముల హజరతయ్య గుప్తా మాట్లాడుతూ.. మనిషి జీవన ప్రక్రియలో ఎదురయ్యే ఒత్తిడులను ధ్యానం దూరం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి బీబీఏ వైస్ ప్రెసిడెంట్ పిల్లా శ్రీనివాసరావు, మహిళా కార్యదర్శి కుమారి అనురాధ, గవర్నింగ్ బాడీ సభ్యులు, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక గురువు శ్రీప్రీతాజీ మార్గంలో ఏకం సంస్థ బోధకురాలు శ్రీఆప్తీజీ (మాధురి) ఈ మెడిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేటి నుంచి బ్యాంకుల సాచ్యురేషన్ క్యాంపెయిన్

ఎస్‌ఎల్‌బీసీ చైర్మన్ భాస్కరరావు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న భాస్కరరావు, ఇతర బ్యాంకుల ఉన్నతాధికారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేంద్ర లక్ష్యాల్లో భాగంగా ఏపీలో బ్యాంకులు జూలై 1 తేదీ నుంచి మూడు నెలలు సాచ్యురేషన్ క్యాంపెయిన్‌ను నిర్వహించనున్నట్లు ఏపీ ఎస్‌ఎల్‌బీసీ చైర్మన్ సీవీఎన్ భాస్కరరావు చెప్పారు. ఈ సందర్భంగా నగరంలోని యూనియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో వివిధ బ్యాంకుల ఉన్నతాధికారులతో కలిసి సాచ్యురేషన్ క్యాంపెయిన్ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని 13,324 గ్రామ పంచాయతీలన్నిటిలో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తామన్నారు. ప్రధానమంత్రి జనధన్ యోజన కింద ఖాతాలు ప్రారంభించడం, ప్రతి ఇంటికి బ్యాంకు ఖాతా ఉండేలా చూడటం, రూపే కార్డు యాక్టివేషన్, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ కోసం ఆధార్ సీడింగ్ వంటివి క్యాంపెయిన్‌లో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కెనరాబ్యాంక్ జీఎం విజయలక్ష్మి, ఏపీ గ్రామీణ బ్యాంక్ జీఎం జుమిలాల్, ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్‌బీఐ ఏజీఎం వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కులాలకు సామాజిక న్యాయం చేయాలి

ప్రభుత్వానికి అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం నేతల విజ్ఞప్తి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ, రవికుమార్ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర జనాభాలో ఆరు శాతానికి పైగా ఉన్న చేనేత కులాలకు సామాజిక న్యాయం చేయాలని అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ సత్యనారాయణ, సూరేపల్లి రవికుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్‌లోని బ్రాంచి కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన చేనేత కులాలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం ఇచ్చి ఆదుకోవాలన్నారు. పద్మశాలి కార్పొరేషన్‌కు తగినన్ని నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తప్పనిసరిగా వారానికోసారి చేనేత వస్త్రాలు ధరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత కులాలకు ప్రభుత్వం నామినేటెడ్ పదవులు కేటాయించాలని, శాసన మండలి, రాజ్యసభలకు ఎంపిక చేయాలని కోరారు. అమరావతి, సింహాచలం దేవస్థానాల్లో పద్మశాలి అన్నసత్రాలకు స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కలిమిశ్రీ, చొప్పా రాఘవేంద్రశేఖర్ పాల్గొన్నారు.

మద్యం అనధికార విక్రయాలు అరికట్టాలని వినతి



ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైన్ షాపుల వద్ద బహిరంగంగా మద్యం తాగడం, బార్లలో అనధికార విక్రయాలను అరికట్టాలని కోరుతూ ఏఐవైఎఫ్ ప్రతినిధులు సోమవారం మారుతీనగర్‌లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి లంక గోవిందరాజులు మాట్లాడుతూ.. నగరంలో అసాంఘిక కార్యకలాపాలు పెరగడానికి ప్రధాన కారణం మద్యం అని అన్నారు. నగరంలోని దాదాపు అన్ని బార్‌లలో ఉదయం ఐదు నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు మద్యం విక్రయాలు సాగుతున్నాయన్నారు. ప్రతి వైన్ షాప్ వద్ద బహిరంగంగానే మందుబాబులు మద్యం తాగుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి వైన్‌షాపులు, బార్‌లపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జాతీయ సమితి సభ్యురాలు గంటా మమత, నాయకులు లంకే సాయి, సింగంశెట్టి మోహన్ ప్రసాద్, షైనీ, పి.నరేష్, డి.స్వప్న తదితరులు పాల్గొన్నారు.